కొన్నాడు. మళ్ళీ మామూలు మనషయాడు. యథాప్రకారం బండిని దొర్లించుకు పోతున్నాడు. వారంరోజులనుంచీ, అంతకుముందు వెంకన్న చేస్తూవున్న దీపారాధన తండ్రిగారి సమాధి దగ్గర తనే స్వయంగా చేస్తున్నాడు. అనాథ శరణాలయ ధర్మకర్తల్లో ఒకరడిగితే చెప్పాడు. "వెంకన్న తన వాళ్ళెవరికో జబ్బుగా వున్నదని జాబువస్తే వూరికి వెళ్ళాడు. వెళ్ళాక యిప్పట్లో రాలేననికూడా జాబు రాయించాడు. వెంకన్నలాంటి నమ్మకమైన మనుషులు సామాన్యంగా దొరకరు! అందుకే దీపారాధన నేనే చేస్తున్నాను." "వెంకన్న పోయిన దగ్గర్నుంచీ నాకు ఒకచెయ్యి విరిగినట్టుంది!" అని కూడా అన్నాడు శివరామయ్య.

ఆరోజు సాయింత్రం మామూలుగానే తండ్రిగారి సమాధివద్ద దీపారాధన చేయటానికొచ్చాడు శివరామయ్య. మునిమాపు. మసక మసక చీకటి. సమాధివున్న ఆవరణలో వేపచెట్లు చీకట్లను పోగుచేసుకొంటున్నయ్. రావిచెట్టు మీద కొంగలు గుంపులు గుంపులుగావచ్చి తెల్లటి రెక్కలు వూపుతూ వాలుతున్నయ్. శరణాలయం కప్పుమీద ఓ గుడ్లగూబ జంటవచ్చి వాలింది.

తండ్రి సమాధిముందు ప్రమిదలో చమురు పోసి వత్తినలుపుతూంటే, ఏదో ధ్వనివిని ఆయనగారివళ్లు జలదరించింది. అగ్గిపుల్ల వెలిగించాడేగాని వత్తిని ముట్టించలేక పోయాడు. మళ్ళీఅదే అరుపు! కుక్క అరుపులు!! సమాధిలోనుంచే వినపడుతూన్నట్లుంది!

వెలిగించిన అగ్గిపుల్ల చేత్తోపట్టుకొనే శివరామయ్య సమాధివెనక్కు వెళ్ళిచూశాడు. సమాధికి కొంచెందూరంలో రెండు నల్లకుక్కలు కొట్లాడుకొంటున్నయ్! ఒక శవాన్ని సగం బైటికిలాగి పుర్రెకొరుకుతూ ఒకదాన్నొకటి కరుచుకొంటూన్నయ్!! శవం సగం మట్టికిందా సగం పైనావుంది.

కుక్కల్ని తరిమేసి శవాన్ని లోతుగా పూడ్చిపెడుతూ, దయార్ద్రహృదయుడు శివరామయ్యగారు యిలా అనుకొన్నాడు. "యానాది తొత్తుకొడుకులు! చంపినవాళ్ళను పూడ్చిపెట్టం తెలియదు డబ్బు తినడంతప్ప!"

సమాధి నల్లరాయి కంపించి ప్రతిధ్వనించింది జాలిగుండె శివరామయ్యగారన్నదాన్ని. అనాథ శరణాలయంమీద వాలిన గుడ్లగూబ జంట భయంకరంగా అరుస్తూలేచి పోయినై.

---

కథానిక

# లోకం దృష్టిలో గోపాలం

ముక్కామల కృష్ణారావు

శ్యామల రెప్ప వాల్చకుండా తనవైపు చూట్టం గోపాలం సహించలేడు. ఆమె చూపుల్లో మెలగుతున్న భావాల తరంగాలు అతని హృదయాన్ని పునాదుల్లోంచి పెల్లగించినట్లు బాధ పడతాడు. అదోమాదిరిగా ఆప్యాయంగా శ్యామల అతన్ని చూట్టంలో ఆమె తప్పేమీ లేకపోయినా ఆమె చూపుల్లో తన మనసును కాల్చివేసే నిప్పురవ్వలు ఉన్నాయని అతని భావం. ఆమె చల్లని చూపుల్లో ప్రళయం గోచరించే భావం దాగి ఉందని అతని నమ్మకం. ఇంతకీ శ్యామల వేరే అమ్మాయి కాదు గోపాలం భార్య! ఐనా ఆమె ప్రేమతో తనవైపు చూట్టం గోపాలానికి అసహనీయం. ఆమె అతన్ని మనసారా ప్రేమించవచ్చు కాని అతను ఆమెను ప్రేమించలేడు. ఆమె మాటలను వినడానికి సహనం అతనిలో లేదు. శ్యామల తన కళ్ళముందు ఉన్నంతసేపు అతనికి ముళ్ళమీద కూచున్నట్లు ఉంటుంది. ఆమె మాట్లాడుతూనే ఉంటుంది కాని ఆమె ప్రతీ పలుకూ అతను అసహ్యించుకుంటాడు. ఆమె తనకోసంచేసే ప్రతీ చిన్న పనీ అతనిలో క్రోధాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. భార్యను ప్రేమించలేకుండా ఉన్నందుకు లోకం గోపాలాన్ని నిందించవచ్చు. అతనిమీద లేనిపోని నిందల భారాన్ని మోపవచ్చు. కాని గోపాలం భార్యను ఎందుకు ప్రేమించలేకుండా ఉన్నాడో లోకానికి అనవసరం. ఒకరి అభిరుచులకు ఆశయాలకు

తెలుసుకునేందుకు అవసరం లేదు లోకానికి. లోకం ఒకటే అంటుంది. భార్యను సంతోష పెట్టలేని అప్రాచ్యుడు గోపాలం! సంసారాన్ని సుఖవంతంగా చేసుకోలేని అసమర్థుడు! భార్యను అదుపు ఆజ్ఞల్లో పెట్టుకోలేని దద్దమ్మ! తొలి భార్య ఎలాగా చచ్చింది. దీన్నైనా సమంగా చూసుకోలేని చవట! కాని లోకానికి దడిసి తను చేయవలసిందేమిటో బోధపడలేదు గోపాలానికి. తను ఎట్లా నడుచుకోవాలో లోకం చెప్పదు అతనికి. కాని తప్పటడుగు వేస్తున్నాడని నిందిస్తుంది. ఇంతకీ మనసుకి ఇష్టంలేనిపని ఉత్సాహంగా ఎవరయినా చేయగలరా? ఇలాగంటే వీలులేకపోయినా చేసి తీరాలంటుంది లోకం. మొదటి భార్యమీద ఉన్న అభిమానం కొద్దీ రెండవభార్యను ఇప్పట్లో పట్టించుకోకపోయినా రానురాను రెండవపెళ్లే బెల్లంముక్క అవుతుందని అంటుంది. కాని గోపాలం మొర వినడానికి లోకానికి తీరికలేదు. వినవలసిన అవసరంకూడా లేదు. ఇంతకీ గోపాలం అదృష్టవంతుడో దురదృష్టవంతుడో తేల్చలేదు లోకం.

గోపాలం చదువు పూర్తవడం, అప్పటికప్పుడే కొన్ని డజన్ల పెళ్ళిసంబంధాలు రావడం గోపాలంలో నూతన ఉత్సాహం ఉబకడం జరిగాయి. పెళ్ళిచేసుకోకుండా అసలు బ్రహ్మచారిగా ఉండడం అసంభవం అనిపించింది గోపాలానికి. అయినా లోకం తనను అవివాహితుడిగా బ్రతకనివ్వదని అతను నిశ్చయించుకున్నాడు. ఒకవేళ తనేకాని పెళ్ళిచేసుకుంటే బ్రతికే బ్రతుకు ఆనందంగా గడవాలి. ఆనందాన్ని అనుభవించాలంటే అనుకూల దాంపత్యం కావాలి. అనుకూలదాంపత్యానికి, తన ఆశయాలతో, అభిప్రాయాలతో ఏకీభవించే సతీమణి కావాలి. ఇది సాధ్యమా అనిపించింది గోపాలానికి. కాని గోపాలం కల్పనలు, ఆశయాలు, అడుగంటిపోలేదు. జీవితంలో అనుభవించబోయే ఆనందాన్ని అందుకోబోతున్నాడని ఉప్పొంగిపోయాడు. కమల గోపాలం జీవితంలో ప్రవేశించింది. కమలని ఆనందంతో స్వీకరించాడు గోపాలం. సంసారంలో కాలు పెట్టాడు. సంసారం సాగరం అన్న లోకోక్తి తనకు అవలంభించదని గర్వపడ్డాడు. సంసారం ఆనందమయం. సంసారమే స్వర్గం! ఆనందమును అనుభవించలేక, ఆనందాన్ని చూరకొనలేక ఆవేదపడే అవివేకుల మూర్ఖత్వానికి ఎంతయినా అసహ్యించుకున్నాడు. జీవితంలో ఆనందాన్నంతా అమృతంలా ఒక్కమారుగా త్రాగేయాలని ఆరాటపడ్డాడు. ప్రతీనిమిషం చిరునవ్వుతో, మల్లెపూలు జడలో అల్లల్లాతుంటే తనముందు ప్రత్యక్షమయే కమల గోపాలాన్ని ఆనందములో ముంచివేసేది. ఆమె పెదవులమీద నాట్యమాడే చిరునవ్వు తరగలు అతని హృదయాన్ని ఉత్సాహంతో ఊగిసలాడించేవి.

కాని బ్రతికేబ్రతుకు ఎన్నటికీ ఒకే ఫక్కీలో ఉండదని తెలుసుకోగలిగాడు గోపాలం. అసలు జీవితపథంలో మార్పులు రాకుండావుంటే ప్రపంచం, జీవితం నిస్సారమవుతుంది. బ్రతికేబ్రతుకు రసహీనమవుతుంది. లోకానికి చేసేందుకు పని ఉండదు. సోమరిపోతులా ఒక బండరాయిలా పడిఉండివలసివస్తుంది. మనుషులు జీవచ్ఛవాలు అవుతారు.

గోపాలం జీవితంలో నాలుగు సంవత్సరాలు ఇట్టే దాటిపోయాయి. గోపాలం ఒక మగబిడ్డకు తండ్రికూడా అయాడు. కాని అతను శిలాప్రతిమగా మారిపోయాడు. కమల చనిపోయింది! తల్లిలేనిబిడ్డ అయాడు అతని కొడుకు. వాడికి మాటలు రాకుండానే కమల ఈ లోకాన్ని విడచిపెట్టింది. తల్లిపాలకి అలవాటుపడ్డ పసివాడు పాలకై లక్కపిడతవంటి నోరును ఉత్తనే చప్పరిస్తూంటే గోపాలం మనస్సు కరకరలాడేది. ఇంట్లో గోపాలం తలిదండ్రులు ఉండబట్టే పసిపాప ప్రాణాలు దక్కాయి.

రోజులు నెలలు ఒకదాని తరువాత ఒకటి జారిపోతున్నయ్.

ఇంట్లో తలిదండ్రులకు, బయట లోకానికి, పట్టుమని పాతికేళ్ళయినా నిండని గోపాలం రెండో పెళ్ళి చేసుకోవడం తప్పనిసరిగా తోచింది. లోకం ప్రక్కపోట్లతో సాధ్యమయినంత త్వరలో గోపాలంకి రెండో పెళ్ళి చేయాలన్న పట్టుదల గోపాలం తలిదండ్రులకు హెచ్చయింది. ప్రపంచాన్ని అప్పటికే అర్థం చేసుకున్న గోపాలం రెండో పెళ్ళి ప్రభావాన్ని ఊహించుకోగలిగాడు. మళ్ళీ పెళ్ళి చేసుకుంటే తనకూ తన కొడుక్కూ వచ్చే లాభనష్టాలు సుళువుగా

గ్రహించుకోగలిగాడు. ఒక విషయంలో (లోకం దృష్టిలో) తను సుఖపడ్డా తన కొడుకు విషయంలో అన్యాయం తప్పదని అతనికి తెలుసు. తను ఎంత చిన్నవాడయినా రెండో పెళ్ళి వాడన్న మాట లోకానికి నాటుకుంటుంది. కొత్తగా వచ్చిన పెళ్ళికూతురు మనసులో యీ రెండో పెళ్ళి అన్న మాట ప్రతీనిముషం కదుల్తూంటుంది. రెండో పెళ్ళి భార్య సవతికొడుకును తన స్వంత కొడుకులా చూసుకోటం అసంభవం. వేరేవాళ్లు ఒక అనాథ బాలుణ్ణి తలిదండ్రుల కన్నా ఎక్కువ ప్రేమతో చూసుకోగలరు కాని సవతికొడుకుని ప్రేమగా చూట్టం కల్ల. ఇవన్నీ లోకానికి తెలుసు. అయినా గోపాలం మళ్ళీ పెళ్ళి చేసుకునితీరాలి. లేకపోతే లోకం ఊరుకోదు.

పిల్లని చూసుకోమన్నారు పెద్దలు. పెళ్ళికూతురు ఎదురుగా కూర్చుందని గోపాలానికి తెలుసు. కాని మళ్ళీ పెళ్ళి ఇష్టంలేని తను అమ్మాయిని చూసినా చూడకపోయినా ఒకటే అన్న భావం గోపాలం మనసులో మెదలడంతో అమ్మాయిని కన్నెత్తి చూడలేకపోయాడు.

పెళ్ళి అయిపోయింది. శ్యామల ఇంట్లో కాలు పెట్టింది. కమల మెలిగే ఇంట్లోనే శ్యామలను చూస్తుంటే గోపాలానికి పిచ్చెత్తినట్లుంది. ఇన్నాళ్లయి పొంచి ఉన్న దుఃఖం ఒక్కమారుగా పొంగిపొరలింది గోపాలానికి. దుఃఖానికి ఉపశమనం అతనికి తెలియదు.

నల్లని శరీరచ్ఛాయ, పెద్ద మొహం, మొహం మీద చిన్న చిన్న కాయలు, వలనైన పెదవులు, ఎత్తయినపండ్లు, లావుపాటి శరీరం! శ్యామలను చూస్తుంటే గోపాలం కడుపులో వికారం పుడుతుంది. ఇలాగంటే లోకం అతనిమీద విరుచుకు పడ్తుంది. అందంలో ఏముందని అంటుంది. గోపాలంకూడా ఒక మానవమాత్రుడని, అతనిలోకూడా కోరికలు ఉంటాయని తెలుసుకొన్న లోకం అతన్ని నిందించడం గొప్పగా పరిగణిస్తుంది. తన తలిదండ్రులు ఈసంబంధాన్ని ఎలా ఒప్పుకున్నారో బోధపడలేదు గోపాలంకి. పోనీ డబ్బుకి ఆశపడ్డా రంటే వాళ్ళిచ్చిన కట్నం డబ్బులు పెళ్ళినాటికే పూర్తిగా ఖర్చుఅయాయి. ఎంత కట్నం పుచ్చుకోక పోతే ఇటువంటి అనాకారి పిల్లలను చేసుకుందుకు సిద్ధపడతారు అని మళ్ళీ లోకం కూస్తుంది. తొలి భార్య బంగారు బొమ్మ. రెండో భార్య! ఎవర్ని నిందించడమో గోపాలంకి బోధపడలేదు.

లోకంతోపాటు శ్యామల కురూపి అయినా ఆమె గుణాలు మంచివయితే, తన కొడుకును ప్రేమతో చూసుకుంటే అదే తనకు నవజీవితం అనుకున్నాడు గోపాలం. అనుకున్నట్లూ అన్నీ జరిగిపోతే విశిష్టత నశించిపోతుంది!

శ్యామలకు కావలసింది డబ్బు. తను ఎంత కురూపి అయినా, తనలో ఎంత అసఖ్యం, అనాగరిత ఇమిడివున్నా తనకు కావలసిన వస్తువులనూ, తన కోరికలనూ తీర్చడం గోపాలం విధి అన్న భావం ఆమెలో నాటుకుంది. అట్లాగని గోపాలం తన శక్తికి మించినపని ఎట్లా చేయగలడు? కాని శ్యామలకి గోపాలం శక్తి సామర్థ్యాలతో పని లేదు. ఆమెకు కావలసింది విలువయిన చీరెలూ, సినీమాలూ. భర్త తాహతును ఆలోచింది కాదు. అతని మంచితనాన్ని కనుకోలేకపోయింది. అతని జీవితంలోకి తొంగి చూడలేకపోయింది. నెలకి సరిపడే వస్తువులను పదిహేనురోజులకే వాడడం గోపాలం ఇంట్లో ఎవరూ సహించలేరు. కోడలు తెలియక చేస్తుందని గోపాలం తల్లి సరిపెట్టుకొనేది. కాని అసలు సంగతి గోపాలంకి తెలుసు. శ్యామల దృష్టిలో గోపాలం ఒక చవట. ఎక్కువ డబ్బు సంపాదించలేని చవట. అత్తగారు, మామగారు, భర్త అంటే ఆమెకు కుక్కకంటె ఎక్కువ గౌరవప్రదంగా తోచలేదు. తన భర్తకు ఒక కొడుకుకూడా ఉన్నాడన్న జిజ్ఞాసయే ఆమెకు కలగలేదు. అయినా ఎంతో ఓర్పుతో శ్యామల దుష్టత్వాన్ని సహించాడు గోపాలం. ఆమెను మంచిమార్గంలో నడపడానికి తన శక్తినంతా ఉపయోగించాడు. కాని శ్యామల నడతలో మార్పులేదు. తన భర్త రెండవ పెళ్ళివాడన్న భావం ఆమెలో గాఢంగా నాటుకుంది. ఇట్లా అంటే లోకం ఊరుకోదు. తెలియకపోతే చెప్పి చేయించుకోవాలి కాని అలా ఊరుకో కూడదు అంటుంది. చెప్తే వినని వాళ్ళు ఉన్నారంటే వినదు లోకం. మీదు మిక్కిలి చెప్పడం చేత కాని చవట అంటుంది. ఇటువంటి ముళ్ళ కంచెలో గోపాలం జీవితం ఇరుక్కుంది. దీనికి లోకం చెప్పే తీర్పు ఏమయిఉండాలి?సంసారం చేయలేని అప్రాచ్యుడుగోపాలం అంటుంది లోకం.